సమాచారం

బైక్ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: నిరుద్యోగ యువతకు ద్విచక్ర వాహనాల రిపేరింగ్‌లో ఉచితం శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ముచ్చింతల్ సమీపంలో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో అటల్జీ వృత్తి నైపుణ్య శిక్షణ సంస్థ, హీరో మోటా కార్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి హీరో మోటోకార్ప్ సర్వీసు కేంద్రంలో ఉద్యోగావకాశం కల్పిస్తామన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల వయసు గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 64 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.

నేడు ముదిరాజ్ భవన్ నిర్మాణ పనులు ప్రారంభం

మణికొండ: ముదిరాజ్‌ల ఆత్మగౌరవ భవన్ నిర్మాణ పనులను గురువారం ఉదయం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ప్రారంభిస్తారని జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు తలారి మల్లేశ్ ముదిరాజ్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముదిరాజ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

26 నుంచి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సమావేశమైన గ్రామస్తులు

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్‌లో గల శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆలయ కమిటీ, గ్రామస్తులు ఈ మేరకు ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. 28న కల్యాణోత్సవం, రథోత్సవంతో పాటు నిత్యాన్నదానం చేయనున్నారు.

నేడు జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 'ఖురాన్' వివరణపై జాతీయస్థాయి సదస్సును గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు అరబిక్ విభాగం హెడ్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్‌జైసీ బుధవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అరబిక్ విభాగం ఆధ్వర్యంలో కేరళలోని ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్ ఖురాన్ (ఐఆర్‌ఐటీఏక్యూ) సహకారంతోఈ సదస్సును నిర్వహిస్తారన్నారు.

క్లుప్తంగా

జీవాల సంరక్షణలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మందుల పంపిణీని పరిశీలిస్తున్న డాక్టర్ అంజిలప్ప

శంషాబాద్ రూరల్: జీవాల సంరక్షణలో యాజమాన్య పద్ధతులు పాటించాలని పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అంజిలప్ప సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గొర్రెలు, మేకలకు బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత నట్టల నివారణ మందులను పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ వి.ఉమాకాంత్, పాల్మాకుల పశు వైద్యాధికారి డాక్టర్ నరోత్తమ్‌రెడ్డి, సిబ్బంది జ్యోతి, సంపత్, నరి, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం



బాలసుబ్రమణియన్



డాక్టర్ రేణుస్వరూప్

రాయదుర్గం: డాక్టర్ బీఎస్ బజాజర్ మెమోరియల్ ఎఫ్‌ఏబీఏ ఎక్సలెన్స్ అవార్డు–2023కు డాక్టర్ రేణుస్వరూప్, డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణియన్‌లను ఎంపిక చేశారు. బుధవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్స్ (ఎఫ్‌ఏబీఏ) ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రెడ్డన్న వీరి పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 నుంచి బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ రంగానికి సుదీర్ఘకాలం పాటు చేసిన సేవలకుగాను ఈ అవార్డులను అందిస్తున్నామన్నారు. డాక్టర్ రేణు స్వరూప్ కేంద్ర బయోటిక్నాలజీ శాఖ కార్యదర్శిగా పని చేశారని, ఆమె జాతీయ కార్యక్రమాల ప్రణాళిక, అమలులో కీలకపాత్ర పోషించారు.అలాగే డాక్టర్ దొరైరాజన్ బాలసుబ్రమణియన్ హైదరాబాద్ ఎల్‌వీప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ డైరెక్టర్‌గా పనిచేశారని పేర్కొన్నారు.. జీనోమ్ వ్యాలీ స్థాపనలో, రాష్ట్ర బయోటెక్నాలజీ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా, సైన్స్ అండ్ టెక్నాలజీని ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఎఫ్‌ఏబీఏ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఆయన్ని ఎంపిక చేశామని పేర్కొన్నారు.

నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచేస్తారా?

- రాజేంద్రనగర్ ఎమ్మెల్యేపై ప్రతిపక్ష నేతల ఆగ్రహం
- సుల్తాన్‌పల్లి వాసులకు ఎమ్మెల్యే అండగా నిలవాలని డిమాండ్
- గ్రామస్తులతో కలిసి కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం నేతల ధర్నా



బాధిత గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ నేతలు

శంషాబాద్: నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజలను రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ నట్టేట ముంచేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆరోపించారు. సుల్తాన్‌పల్లి గ్రామస్తులకు అండగా నిలవాల్సిన ఎమ్మెల్యే తన అనుచరులకు భూములు దక్కేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ యాటకారి సిద్దేశ్వర్ ఆధ్వర్యంలో సర్వే నంబర్.120, 142లలోని 25 ఎకరాల భూముల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పట్టాలు పొందిన లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ధర్నాలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, ప్రజా సంఘాల నేతలు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. నియోజవకర్గంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ భూములను కబ్జాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ భూములకు సంబంధించిన శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పట్టాలున్న 8 మంది బాధితులు గత కొన్ని రోజులుగా తమ భూములు తమకు ఇప్పించాలని పోరాటం చేస్తుంటే ఎమ్మెల్యే వారికి ఎందుకు అండగా నిలవడం లేదని ప్రశ్నించారు. ప్రజా నాయకుడిగా బాధితుల పక్షాన ఎమ్మెల్యే నిలిచి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్ కబ్జాలు మితిమీరుతున్నాయి..

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ నాయకుల కబ్జాలు మితిమీరుతున్నాయని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే అండదండలతో కబ్జాకోరులు చెలరేగిపోతున్నారన్నారు. బాధితులకు వెంటనే న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సర్వే పనులు నిలిపివేయండి...

సర్వే నంబర్.120, 142లలోని 25 ఎకరాల భూముల్లో జరుగుతున్న సర్వే పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శిఖం భూముల్లో ఉన్న చెట్లను తొలగించినా ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. ప్రభుత్వ భూ ములు ప్రైవేటు భూములుగా ఎలా మారాయయని ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కొందరు ఉన్నతాధికారులు కూడా లోపాయికారిగా ప్రైవేటు వ్యక్తులకు సహకరిస్తున్నార ని మండిపడ్డారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సమస్య పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపేది లేదని తేల్చి చెప్పారు. అనంతరం గ్రామస్తులు, పార్టీల నేతలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమ ంలో పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేంద ర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు మైలారం సులోచన, బీజేవైఎం నాయకులు శ్రీధర్, మండల మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, సీపీఎం నాయకులు మల్లేష్ పాల్గొన్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తా..: తహసీల్దార్

ప్రజలు, పార్టీల డిమాండ్లను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామస్తుల వినతి మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన చెప్పారు.

వీధి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తాం



జంతు ప్రేమికులతో మాట్లాడుతున్న కమిషనర్

మణికొండ: రోడ్ల వెంట నడుచుకుంటూ వెళ్తున్న వారిని కుక్కలు కరిచి గాయపర్చడం, చంపటం వంటి చర్యలను నివారించేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బ్లూక్రాస్ సొసైటీ, మణికొండ జంతు సంరక్షణ వలంటీర్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలోనే కాలనీల సంక్షమ సంఘాలు, కౌన్సిల్ సభ్యులతో జంతు సంక్షేమం, నివాసితుల భద్రత కొరకు వలంటీర్లతో కూడిన కార్యాచరణను సిద్ధం చేయాలని నిర్ణయించారు. రాకపోకల్లో వీధి కుక్కలు ఉంటే ఎలా నడుచుకోవాలనే విషయంపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా చందనవెల్లిలో వెల్‌స్పన్ గ్రూప్‌కు చెందిన అత్యాధునిక సాంకేతిక టెక్స్‌టైల్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి వెళ్తున్న మంత్రి కేటీఆర్‌ను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పోలీస్ అకాడమీ చౌరస్తా వద్ద ఘన స్వాగతం పలుకుతున్న చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు. - బండ్లగూడ



చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలి



చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న కౌన్సిలర్ మేకల

శంషాబాద్: చిన్నారులకు బలవర్ధకమైన పోషకాహారాన్ని అందించాలని 17వ వార్డు కౌన్సిలర్ మేకల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. పట్టణంలోని సిద్ధాంతి అంగన్వాడీలో జరిగిన అన్నప్రాసన కార్యక్రమంలో ఆయన చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో పెరుగు రమేష్, కొంకరి రాజు, కన్నయ్య, సుధాకర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



గుడిసెలు వేసుకున్న వారి సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

బండ్లగూడ: గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం పార్టీ గండిపేట మండల కన్వీనర్ రుద్రకుమార్ అన్నారు. బుధవారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాయకులు పర్యటించి స్థానికంగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదల సమస్యలను వివరించారు. వారు మాట్లాడుతూ.. పీరంచెరువు ప్రాంతంలో గత పదిహేనేళ్లుగా దాదాపు 20 పేద కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, వీరికి స్థానికంగా రేషన్ కార్డు, ఓటర్ ఐడీ అన్ని హక్కులు కలిగి ఉన్నాయన్నారు. ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వీరికి ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు వి.బాలస్వామి, సంజీవ, నరేష్, శివ, అనిల్, బంటప్ప, బుగ్గప్ప, వెంకట్ మాణిక్యం, అంజి, నర్సప్ప, సత్యమ్మ, వసంతమ్మ, భారతమ్మ, అమ్మమ్మ, రజిత తదితరులు ఉన్నారు.

పెట్టుకున్న లక్ష్యం దిశగా విద్యార్థులు శ్రమించాలి



వ్యాపార వేత్తలకు మొక్కలిచ్చి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని పెట్టుకుని ఆ లక్ష్యం సాధించే దిశగా వరకు నిరంతరంగా శ్రమించాలని ఏజీ వర్సిటీ డీన్ డాక్టర్ గీర్వాణి, వర్సిటీ పూర్వ విద్యార్థి, వ్యాపార వేత్త సందీప్ శౌర్య అన్నారు. రాజేంద్రనగర్‌లోని శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో బీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు ఉద్యాన విద్యతో పాటు ఇంగ్లిష్ బాషపై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నిరోషా, మమత తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్..

యువతి అదృశ్యం



సాయిదివ్య(ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మైలార్‌దేవ్‌పల్లి మధుబన్ కాలనీకి చెందిన శ్రీనివాసరావు కుమార్తె జి.సాయిదివ్య(23) ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో సాయిదివ్య ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో పాన్ షాపు నిర్వాహకుడు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్వేత వివరాల ప్రకారం.. టోలిచౌకి ప్రాంతానికి చెందిన తాహేర్(38) రాజేంద్రనగర్‌లో పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తాహేర్ తల, ఛాతీకి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడస్పీ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

'న్యాయవాదులపై దాడులు సరికాదు'



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాజేంద్రనగర్: న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని రాజేంద్రనగర్ కోర్టు న్యాయవాదులు డిమాండ్ చేశారు. నల్గొండ జిల్లా కోర్టుకు వెళ్లి వస్తుండగా న్యాయవాది సురేందర్‌పై దాడికి పాల్పడటాన్ని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజుబాబుగౌడ్, ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణలు ఖండించారు. ఈ మేరకు సురేందర్‌కు మద్దతుగా రాజేంద్రనగర్ కోర్టు ఆవరణలో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ప్రవీణ్, ఎంజీ రెడ్డి, పూర్ణచందర్‌రెడ్డి, శ్రీనివాస్, వరప్రసాద్, సిద్ధేశ్వర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, కిరణ్, సతీష్, రవి తదితరులు ఉన్నారు.

పేదల కోసం కేంద్రం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది

రాజేంద్రనగర్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పేదలు అభ్యున్నతి కోసం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య వెల్లడించారు. అత్తాపూర్ డివిజన్‌లోని పాండురంగానగర్‌లో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్డుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొమురయ్య మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమభాయ్‌హాల్లాలే, ముకేష్ బిరాదర్, దత్తురావు తదితరులు పాల్గొన్నారు.



నమోదు కార్యక్రమంలో మోంద్ర కొమురయ్య

వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలి

రాజేంద్రనగర్: విద్యుత్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఇతేహాద్ యూనియన్ అధ్యక్షుడు మీర్ బాసిత్ అలీఖాన్ డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఏప్రిల్ 2022 వేతన సవరణ పీఆర్‌సీ కోసం నిరసన చేపట్టారు. ఈ నిరసనలో యూనియన్ ప్రధానకార్యదర్శి ఖాజాపాషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ షేక్ అహ్మద్, లక్ష్మీనారాయణ, ఆసిఫ్, ఆంజనేయులు, తెలంగాణ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, ప్రధానకార్యదర్శి సిద్ధయ్య, రాజు, మాణిక్యరావు, శివాజీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసనలో విద్యుత్ కార్మికులు, ఉద్యోగులు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



బండరాళ్లను చదును చేసిన దృశ్యం

రాజేంద్రనగర్: హైదర్‌గూడ సర్వే నంబర్.7లోని ప్రభుత్వ స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చదును చేశారు. భారీ ఎత్తున రాళ్లను పగులగొట్టి చల్లా చెదురు చేశారు. స్థానికుల వివరాల ప్రకారం... రూ.2 కోట్లకు పైగా విలువ చేసే ఈ స్థలాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు పట్టాలుగా అందజేసిందని, మిగిలిన స్థలాన్ని ప్రజావసరాల కోసం వదిలేసిందన్నారు. ప్రస్తుతం వెయ్యి గజాల ఖాళీ స్థలంలో పెద్ద గుండురాయితో పాటు రాళ్లు, రప్పలు ఉన్నాయి. రెండ్రోజులుగా ఈ రాళ్లను కొందరు ధ్వంసం చేసి చదును చేస్తున్నారు. ఈ విలువైన స్థలాన్ని కాపాడాలని బుధవారం ఉదయం పనులను నిలిపి రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేశారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : కార్పొరేటర్

మైలార్‌దేవ్‌పల్లి: నిరంతరం ప్రజల్లో ఉంటూ వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ రాజీవ్‌గృహకల్పలో బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ మేరకు స్థానిక ప్రజలను ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు అడికే జనార్ధన్, శరణమ్మ, టి.శేఖర్‌రెడ్డి, పాండుయాదవ్, అడికే శివ, వెంకటరమణరెడ్డి, శ్రీనునాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ వినయ్, బస్తీవాసులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

ఆరోగ్యం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలి



విద్యార్థుల ఆరోగ్య పరీక్షల కార్యక్రమంలో కౌన్సిలర్ శివారెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి జాగృతం చేయాలని కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి అన్నారు. బుధవారం కోకాపేట ప్రభుత్వ పాఠశా లలో విద్యార్థులకు గాంధీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జి.శివారెడ్డితో పాటు నార్సింగి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, ప్రధానోపాధ్యాయురాలు కళావతి, నర్సింగ్ స్కూల్ ఇన్‌చార్జిలు కె.సమత, జ్యోతి, హసీనాబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై పరిశోధనలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

ఏజీవర్సిటీ: వాతావరణ మార్పుల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి పరిష్కారం చూపాలని వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ జయశంకర్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి రఘునందన్‌రావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో 3వ పరిశోధన విస్తరణ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణలో పెద్ద ఎత్తున సాగునీటి వనరులు కల్పించిన నేపథ్యంలో భూముల్లో ఎటువంటి మార్పులు కనిపిస్తున్నాయో రైతులతో చర్చించి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతేకాకుండా రైతుల ఆదాయం పెంచడానికి అవసరమైన సాంకేతికతను అభివృద్ధి పరచాలన్నారు. సుస్థిర వ్యవసాయం వైపు రైతులను మళ్లించాల్సిన అవసరం ఉందని, రసాయన ఎరువులు తగ్గించాలని, అప్పుడే రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. 2020–22 సంవత్సరంలో నిర్వహించిన వ్యవసాయ పరిశోధనలు, నూతన వంగడాలను గురించి పరిశోధన సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, విస్తరణ సంచాలకులు సుధారాణి వివరించారు. ఎలక్ట్రానిక్ వింగ్ ఆధ్వర్యంలో రూపొందించిన 3 డీవీడీలను ఉపకులపతి ఇతర అధికారులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, అధికారులు తగు సూచనలు సలహాలు అందించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నాయకుడు రవికుమార్ యాదవ్

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత బీజేపీ కార్యకర్తలదేనని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ సూచించారు. గచ్చిబౌలి డివిజన్ టెలికామ్‌నగర్‌లో పార్టీ ఆధ్వర్యంలో స్ట్రీట్ కార్నర్ సమావేశాన్ని శక్తి కేంద్ర ఇన్‌చార్జీ ధర్మగారి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పథకాలైన ఆయుష్మాన్ భారత్, ముద్ర యోజన, సుకన్య సమృద్ధి యోజన, ఇతర పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక నిర్ణయాలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో శేరిలింగంపల్లిలో బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేంద్రరావు, మూల అనిల్‌గౌడ్ ,కృష్ణ ముదిరాజ్, హన్మంతునాయక్, విఠల్, వెంకటేష్, సంజీవ్, దినేష్‌యాదవ్, విశ్వనాథ్, మురళి, టెలికామ్ నగర్‌వాసులు పాల్గొన్నారు.

'డబుల్' ఇల్లు ఇప్పిస్తానంటూ ఎనిమిది మందికి టోకరా

- అప్పుడిస్తా..ఇప్పుడిస్తా అంటూ దాటవేయడంతో బయటపడ్డ నిజం
- పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు



నిందితుడు రవికుమార్

రాజేంద్రనగర్: డబుల్ బెడ్రూమ్ ఇళ్లను ఇప్పిస్తానని ఎనిమిది మందిని ఓ మాయగాడు మోసం చేసిన ఘటన అత్తాపూర్ పరిధిలో చోటు చేసుకుంది. ఔట్‌పోస్టు పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం ... అత్తాపూర్ రాంబాగ్ ప్రాంతానికి చెందిన జి.భాస్కర్‌రావు కుమారుడు జి.రవికుమార్(34) కంప్యూటర్ కంప్యూటర్‌పై మంచి పట్టు ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వివిధ కారణాలతో కరోనాకు ముందే ఉద్యోగం నుంచి తీసి వేశారు. అదే సమయంలో లాక్‌డౌన్ విధించడంతో గతంలో మెయిల్ నర్సుగా ఉద్యోగం చేయడంతో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా అవతారం ఎత్తాడు. కరోనా సమయంలో కరోనాతో బాధపడుతున్న వారికి మందులు ఇవ్వడం, వారి బాగోగులను ఇంటి వద్దే వెళ్లి చూసి రావడం చేశాడు. ఇదే సమయంలో ఎమ్మెల్యే పీఏ తండ్రికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఇంటి వద్దకు వెళ్లి సెలన్ బాటిళ్లను ఎక్కించి వచ్చేవాడు. దీంతో అతడితో పరిచయం ఏర్పడింది. ఇదే అదునుగా భావించి తనకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పీఏ రఘు పరిచయం అని, మీకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇప్పిస్తానంటూ 7 మంది నుంచి రూ.1.60 లక్షల చొప్పున, ఒకరి నుంచి రూ.2.60 లక్షలను వసూలు చేశాడు. ఇందుకుగాను ఎమ్మెల్యే లేటర్ ప్యాడ్‌తో పాటు ఎమ్మెల్యే పీఏ పేరుపై వాట్సాప్, జీ-మెయిల్ అకౌంట్లను ఓపెన్ చేసి బాధితులను నమ్మించాడు. డబుల్ ఇల్లు మొదట రాజేంద్రనగర్‌లో అని, అనంతరం జల్‌పల్లి అని, అనంతరం ఇబ్రహీంపట్నం అని దాట వేశాడు. దసరాకు ఇస్తున్నారంటూ ఎమ్మెల్యే పీఏతో వాట్సాప్‌లో చాటింగ్ చేశానని ఎవరెవరికి మంజూరయ్యాయో వాట్సాప్‌లో పేర్లు పెట్టి ఆ స్క్రీన్ షాట్లను వారికి పంపించాడు. కలెక్టర్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే పీఏ మెయిల్‌కు మంజూరీ లెటర్ వచ్చిందంటూ మెయిల్ సృష్టించాడు. రేపు, మాపు అంటూ దాట వేస్తుండడంతో అనుమానం వచ్చిన నలుగురు గట్టిగా నిలదీయడంతో వారికి రూ.1.50 లక్షల చొప్పులన నలుగురికి అందించారు. మిగిలిన వారిని నమ్మిస్తూ వారికి గిఫ్ట్ డీడ్‌తో పాటు డబుల్ ఇల్లు మంజూరైందంటూ బాండ్ పేపర్లను సృష్టించి అందించాడు. వీటిని తీసుకువెళ్లిన బాధితులు ఎన్క్వైరీ చేయగా నకిలీవి అని తేలాయి. గట్టిగా నిలదీయడంతో డబ్బులు ఇస్తానని తెలుపుతూ గతేడాది జులై నుంచి తిప్పుతున్నాడు. దీంతో బాధితులు బుధవారం సాయంత్రం అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.